# పల్టీ

పి.శ్రీనివాస్‌గౌడ్

వొట్టి ఎఱ్ఱిబాగుల మొకమోడైన సంపంగి సీనుగాడు మా యింటికొస్తే చాలు "నీకు పనీపాటల్లేవా...? చదువూ చట్టుబండల్లేవా..? రోడ్లెమ్మటబడి ఆ వజాన తిరుగుతావుంటే మీ యమ్మానాన ఎట్టూరుకుంటున్నార్రా...?" అంటా ఆడ్ని ఏయించుకు తింటావుండే మాయమ్మను చూసినప్పుడల్లా నాకు కడుపులో సరసరా కాల్తావుండేది. మళ్లా గుబుల్దిరిగితే ఆడ్నే పిలిచి మరీ చక్కిరాలో బూరెలో అరిశెలో ఏదొకటిచ్చి 'తినరా' అనేది. నాకూ ఆడికీ చచ్చిగీపెట్టుకున్నా అర్థమయ్యేదిగాదు మాఘుమ్మ యవ్వారమేందో...

అసుమంటి ఘా.యమ్మ మేం పెందళాడే పొయ్‌·ఇసకదిబ్బలకాడ పల్టీలేత్తన్నామంటే ఇని వూరుకుంటదా... చీపురు కట్టత్తుకురాదూ... అందుకే మా యమ్మ చూడకుండా నేగ్గా ఆడు నన్ను పిలవడమో... లేదంటే నే మాయమ్మ కళ్లుకప్పి పోవడమో జరుగుతావుండేది.

అట్టాగే ఓరోజు ఎట్టైతేనే... మాయమ్మ కళ్లబడకుండా, తత్తరబిత్తరగా చూసుకుంటావొచ్చాడు సంపంగి గాడు. అప్పటికే నేను రెడీ అయిపొయ్ వున్నాగానీ, మాయమ్మకి మస్కాకొట్టే దారాలోచిత్తావున్నా.

సంపంగిగాడు మా యింటి కటకటాల్లోంచి తలపెట్టి పిల్లిలాగా "సీనూ... రేయ్ సీనుగా..." అని గొంతంతా అణుచుకొని పిలుత్తా వున్నాడు.

ఇంతలోకే మాయమ్మ యాడ్నుంచి వొచ్చిందో ఏమోగానీ, ముంజికాయంత కళ్లేసుకొని సంపంగిగాగ్ని చూడ్నే చూసింది. చేతిలో పేడనీళ్ల బొక్కెటాడ బెట్టి వాడి ఎనకాలవొచ్చి "ఏయ్యా... వచ్చా తెల్లారి పాటికి" అంది బఱ్ఱిగొంతేసుకొని.

సంపంగిగాడు బిత్తపొయ్ నిక్కర్లోనే వుచ్చపోసుకొనేంత పన్జేసేలోపే మాయమ్మ "నీకు మా సీనిగాడికి ఏంద్రా పొద్దాక సావాసం...? తింటం, తిరగడం, ఇరగబట్టం. ఇదే పనా ఇరవైనాలుగ్గంటలూ మీ యిద్దరికీ... అరరెరెరె... బళ్లో చెప్పిన పాటాలు చదూకుందావే. ఇంటిపట్టునుండి ఇంటో ఏద్దైనా పనికి సాయమొద్దావే అనే ధేస ఏకోశానా లేకపోయా..." అంటా అందుకుంది.

ఆడ సంపంగిగాడికి దిమ్మతిరిగిపొయ్యేటట్టు అక్షింతలు పడతన్నయ్యి. ఈడ నేను ఇంటెనకమాల నుంచి జంపు.

ముంతావారి సెంటర్ రోడ్డు మీద కాస్సేపుండేసరికి సంపంగిగాడొచ్చాడు. "యారా మాయమ్మ బాగా తిట్టిందా..." అన్నా ఆడ్ని నామొకమంతా పిడికిలంత జేస్కోని.

ఆడు జేబులోంచి కజ్జికాయ తీసి చూపిత్తా "నాకు మీయమ్మ కజ్జికాయిచ్చిందిగారా చ్కీ..చ్కీ.."అన్నాడు సైగ్గా కనుబొమ్మ లెగరేత్తా. 'ఓరినాయాల కదరా...' అనుకున్నా మనస్సులో.

సంపంగి సీనుగాడు పొట్టిగుంటాడు. చామనచాయరంగు, మా యింటికెనకమాల మునిసిపాలిటీ హైస్కూలు పక్కనే ఆడి గుడిసె. ఆళ్లు తూర్పోళ్లు. ఆడి అమ్మనాన్నలిద్దరూ ఈడలేరు. తూరుపు (శ్రీకాకుళం)




లో వున్నారంట. అందుకొని ఆళ్ల అమ్మమ్మోళ్ల కాడుండి, ఆడీడ హైస్కూల్లో చదూకుంటున్నాడు.

ఆడూనేనూ హైస్కూల్లో ఒకటే క్లాసు. పయ్‌గా పల్టీలు నేర్చుకోవడానికని నెలరోజులమించి కుందేరు దగ్గిర ఇసుకదిబ్బల కాడకి రోజూ కల్సిపోతుండటంతో ఇద్దరం బాగా సావాసం అయిపొయ్యాం.

మా యింటికీ ఇసుకదిబ్బలకీ చాల్దూరం.

ఇద్దరం కాళ్లకి కాళ్లు కొట్టుకుంటా నల్ల గాంధీ బొమ్మదగ్గిర శివాలయం కాడకొచ్చేసరికి మా కాళ్లకి బ్రేకులు పడిపొయ్నియ్యి.

"యారా... సంపంగీ... మతీన్‌గాడ్ని కూడా పిలుద్దామా?" అన్నా.

"అదేరా నానోట్టోనూ నాన్తావుంది. పద... ఆడూ వుంటేనే బావుంటది." అన్నాడాడు కూడా మతీన్‌గాడి ఇంటేపు దారితీస్తా.

మతీన్‌గాడిల్లు గంజిపాలెంలో శివాలయం పక్కన్నే. ఆడు కూడా మా క్లాసే. ఇసకదిబ్బల గేంగులో ఒకడు. మతీన్‌గాడోల్లమ్మ మ్మమ్మల్ని చూసికూడా నెత్తిమీద చెంగు కప్పుకుంటూ "ఇప్పుడే పోయాడ బ్బాయ్" అంది.

'ఓరి మతీన్‌ముండాకొడకా... అప్పుడే ఎళ్లిపోయా...' అనుకొంటా యిద్దరం ఇసకదిబ్బలకేసి పోలోమంటూ లగెత్తాం. ఆడకి చాల్దగ్గిర దిబ్బలు.

మా ఇసకదిబ్బలు కుందేరు రోడ్డుకి కూతేటు దూరంలో కుడిపక్కనుండేయి. పెద్దా చిన్నా దిబ్బల్తో కలగలిపి ఎనిమిదుండేయి. ఆ తర్వాత పొయ్యేకొద్దికి అంతా ఎడారి. దారిపక్కనా, దిబ్బలమీదా అక్కడక్కడా తాడిచెట్లు ఇంతింతెత్తునుండేయి. ఆటి తాటిమట్టల కింద కల్లుముంతలు యాలాడికట్టుండేయి. నాలుగో దిబ్బెనకాల మాత్రం తాడిచెట్లు చాలుండేయి గుంపులుగుంపులుగా. అద్దాటితే సరికతోపు. ఆడ జుయ్‌మంటా గాలీత్తావుండేది. ఇయ్యన్నీ ఒకెత్తయితే సరికతోపుముందున్న మంచీనీళ్ల దొరువొకెత్తు. దాన్నిండా తామరాకులూ, పూలు అల్లిబిల్లిగా అల్లుకుపోయి నీళ్లలో కాలుపెట్టడానిక్కూడా లేకుండా వుండేయి. అందుట్లో నీళ్లుంటాయి... నా సామిరంగా... ముంజినీళ్లేననుకో. అంత తియ్యంగుండేయి. దిబ్బలమీద ఎగిరెగిరొచ్చి సోలిపోయే పేణాల్ని ఆడ ఆరబెట్టుకుంటా వుండేవాళ్లం మేంముగ్గురం.

ఏమాటకామాట చెప్పుకోవాలంటే పల్టీలు కొట్టటంలో మాత్రం సంపంగిగాడు పేద్ద మొగోడే. ముందుకి, ఎనక్కి, పక్కకి, ఏ పల్టీ అయినా సరే... దానెమ్మ ఆడికాడకి పరిగెత్తి రావాల్సిందే. సంపంగి గాడంత మొనగోడ్ని కాదుగానీ, నేనూ వోమోస్తరుగా బానే ఏసేవోణ్ణి పల్టీలు.

ఎట్టైనాసరే చేతులు ఇసక్కి ఆనకుండా గాల్లోనే పల్టీలు కొడదామని వారంరోజులమించి ముగ్గురం ఒళ్లు నుగ్గునుగ్గు చేసుకుంటున్నాంగానీ, ఆ గాల్లో పల్టీలు మాకు లొంగటంలా. పైగా ఒళ్లంతా పిండిమరలో ఏసి ఆడించినట్టు వూనంవూనం అయ్యిపోతుంది. చెయ్యి మనికట్టు, కాలి మడేలు బెణికి యమతీపులు తేసేవి. నడుములు గిడుముల్తోసహా అన్నీ పట్టకపోయి రేత్రిళ్లు నిద్రలో పోనిచ్చేయికాదు.

అస్సలికి మేవిట్టా మా ఎముకల్లో సున్నవంతా ఆ దిబ్బలమీద దారవోసి పల్టీలో... పల్టీలో అని అదేరందిగా పల్టీలు నేర్చుకోడానికి, ఆ మాయదారి పల్టీల పిచ్చి తాటిబుఱ్ఱల్లో ముంజికాయలు ముదిరినట్టు మా బుఱ్ఱల్లో ముదరడానికి... ఎనక చిన్న కతుంది.

అదేంటయ్యా అంటే మా చీరాలకి అప్పట్లో బూస్‌లీ సిన్మాలూ... కరాటే సిన్మాలూ తెగొత్తావుండేయి. ఒకసారి మాయమ్మ మాంచి కళనుండి ఇచ్చిన రూపాయిబిళ్ల దీస్కోని శాంతాలుకి ఎళ్లా. అందులో ఏదో కరాటే సిన్మా అడతంది. నా కళ్లకి కమ్మగుంది ఆ సిన్మా. అప్పట్నుంచి ఆటిరుచి మరిగి, ఆ సిన్మాలొచ్చినప్పుడల్లా మాయమ్మను పీడిచ్చిపీడిచ్చి ఏదిచ్చి ఏదిచ్చి రూపాయి తీస్కోని పోయ్యేవోడ్ని. ఆ సిన్మాల్లో పొట్టిముక్కులోళ్లు చీమకళ్లోల్లూ 'హా', 'హూ' అంటూ గాల్లో గద్దగాలిపటంలాగ గింగరాలు తిరగతా, పల్టీలు ఏసుకుంటా కఱ్ఱ ఫైటింగూ, కత్తి ఫైటింగూ చేత్తావుంటే నాతోపాటూ ఆ సిన్మాకొచ్చిన జనవంతా నిలువుగుడ్లేసుకొని అట్టానే తెరెంక చూత్తుండటంలో నాకు తోడుబోయి అట్టాగే కన్నార్పకుండా చూత్తుండేవోళ్లు. ఆటొదిలాక 'అబ్బొరే... ఏం ఫైటింగులూ... ఏం పల్టీల్రా... ఎప్పుడేనా ఎన్టీవోడుగానీ, నాగ్గేడుగానీ ఇట్టా చేసేరంట్రా... మనోళ్లదంతా దూపురా' అనుకుంటూ సిన్మాపల్టీల సంగతే పదేపదే ఇచిత్రంగా చెప్పుకుంటూ పోతావుండేవోళ్లు. ఇదంతా ఇంటాఇంటా వుంటే నాకు బలే ఒళ్లు పొంగిపోయేది. సిన్మాల కబుర్లు ఉన్నయ్యిలేనియ్యి ఏసి అబ్బురబ్బురంగా చెప్పుకుంటానికి సంపంగి గాడిక్కూడా నేనే నేలటిక్కేట్టు తీసి తీస్కెళ్లేవోడ్ని సిన్మాకి. మతీన్‌గాడ్ని ఆళ్లింటో అసలు సిన్మాలకే పంపరు. సంపంగిగాడూ, నేనూ సిన్మా చూసొచ్చి మతీన్‌గాడికి చెరోపక్కా చేరి సిన్మాలో వాడిట్టా చేసాడు, ఆడట్టా చేసాడు అని యాక్షను చేత్తా మరీ చెబుతుండేసరికి వాడు బలే బాధగా మొకంపెట్టి మామీద లోపల్లోపలే కుళ్లుకుంటా వుండేవోడు.

అట్టాట్టా పల్టీల తీట ఒకళ్లనుంచొకళ్లకి ముగ్గురికీ అంటింది. కరాటే సిన్మావొచ్చినప్పుడల్లా హైస్కూలుకి నామం పడేది. మా యింటో మాయమ్మ బొడ్డుకాడ సంచికి చిల్లుపడేది.

సిన్మాల్లో ఏసినట్టు నేనూ పల్టీలెయ్యాలని., గాల్లో గింగిరాలు గింగిరాలు తిరుగుతాపోయి నేలమీద దూకాలని.. నిద్దర్లో కలల్లోకూడా నాకు ఇయ్యే వచ్చేయి. సంపంగి గాడికీ, మతీన్‌గాడికీ కూడా ఇట్టాగే ఉందంట.

ఇక మాకు పల్టీలెయ్యాలన్న ఉబలాటం పెరిగిపెరిగి ఏనిగంతయ్యి·మనసాత్రం పట్టలేక, ఒక శుభమూర్తాన మా హైస్కూల్లోనే పల్టీలెయ్యటం మొదలుపెట్టేసాం ముగ్గురం.

మొదట్లోమొదట్లో పల్టీలెట్టెయ్యాలో చాతకాక తెలీక ధమాధమామని కిందపడి వీపులు వాయగొట్టుకొని, కాళ్లూచేతులూ బెణికిచ్చుకొని తలంతా ఇసుకజేసుకొని బేవార్సోళ్లలాగా ఇళ్లకి ఎళుతుంటేసరికి... మా అవతారాలు చూసి ఇళ్లల్లోగూడా వీపులు వాయగొడుతుంటేసరికి.. 'ఏం చెయ్యాల్రాబాబూ..?' అని ఆలోచిచ్చగా ఆలోచిచ్చగా మతీన్‌గాడు బంగారంలాంటి ఇసుకదిబ్బల అయిడియా ఇచ్చాడు. ఆడైతే దెబ్బతగల్దు. దిబ్బలమీద నుండి దొల్లుతూ తుళ్లుతూ పల్టీలేసుకోవచ్చు. ఇక ఆరోజు

మించి ఇసుకదిబ్బలకి మరిగాం.

రోజూ మేం ఆడ పల్టీలేత్తావుంటే ఆ ఇసుకదిబ్బలదారెమ్మట పొయ్యేవోళ్లు, వచ్చే వోళ్లు మమ్మల్ని మా పల్టీల్ని జెమినీ సర్కసు చూసినంత దీచ్చగా, ఇచిత్రంగా చూస్తా తలాడిచ్చుకుంటాపోతావుండేవోళ్లు. మరీ పల్లెటూరోళ్లయితే చూస్తాచూస్తా ఉండబట్టలేక 'ఏందబ్బయా... ఇట్టా కిందకీ మీదకీ ఒకటే ఇరగబడతన్నారుకదా నడువులిరగవూ' అని అడుగుతూ వుండేవోళ్లు.

ఒకరోజు మేం రోజుట్లాగే పల్టీలేసుకుంటూ వుంటే ఎవరో పొట్టిగా, ఎర్రంగా వున్నాయన మా దగ్గర కళ్లావొచ్చి, మమ్మల్ని మా పల్టీల్ని పరీచ్చగా చూత్తా నిలుచోనున్నాడు. 'ఆ... ఎవరో దారినపొయ్యేదానయ్యు. మనకెందుకులే' అనుకొని మా మానాన మేం పల్టీలేసుకుంటున్నాం.

అయిదు నిముషాలు తాలి ఆ కొత్తాయన మా దగ్గరకొచ్చి 'మీకివన్నీ ఎవరు నేర్పించారూ..?' అనడిగేడు.

"ఎవరూ నేర్పలేదు" అన్నాడు సంపంగి.

నేనందుకోని "కరాటే సిన్మాలు చూసి మాకు మేవే నేర్చుకున్నాం" అన్నా గొంతు గొప్పలకి పొయ్యేటట్లు పెట్టి

"ఏందీ ఎవరూ నేర్పకుండా నేర్చుకున్నారా!" అన్నాడాయన ఆశ్చర్యపోయి.

అవునని తలూపేం ముగ్గురం.

"మీరు పల్టీలు బానే ఏస్తన్నారుగానీ, ఎయ్యాల్సిన రీతిలో ఎయ్యటంలా. పల్టీ ఏత్తే విల్లుబద్ద వొంగినట్టుండాల..." అన్నాడు.

అన్నోడు అన్నట్టు ఊరుకోలా. లటక్కమని ఎనక్కి పల్టీ ఏసాడు. ఆ పల్టీ మేం చూత్తంటే కరాటే సిన్మాల్లో గుండ్లు మీద ఆరు మిచ్చలుండే సన్నాసోళ్లు పల్టీ ఏసినట్టు కరకట్టుగా వుండేసరికి మేం ముగ్గురు ఒళ్లు తెలీక నోళ్లు తెరిచాం.

ఆ ఒక్క నిముషంలో మాకు ఆయనంటే అపారమైన బయబక్తులూ, మరియాద వచ్చేసినియ్యి. ఎవరో దారినపోయే దానయ్యనుకున్నాంగానీ, ఇట్టా... అమ్మో...!

ముగ్గురం చేతులు కట్టుకొని ఆయన చుట్టూ మూగాం.

"సార్! మీరేడ నేర్చుకున్నారు సార్ పల్టీలు? బలేగేత్తున్నారు?" అన్నాడు. మతీన్గాడు ఆయన్ని ఈరోలాగా చూత్తా.

"నేనూ మీకుమల్లే చిన్నప్పట్నుండీ పల్టీలేత్తా వుండేవోడ్ని. ఆ తర్వాత ఒక గురువుగారు నాకీ పల్టీలన్నీ నేర్పించారు. చానాళ్లయిందిలే. ఎన్నో పోటీల్లో ప్రెయిజులు కూడా వొచ్చినియ్యి" అన్నాడాయన మా ముగ్గురుకేసి చూత్తా.

'మీ పేరేంటి సార్?' అన్నాడు సంపంగిగాడు. "ఖరీముల్లా" అన్నాడాయన.

ఆయనట్టా కరీముల్లా అనంగానే మన మతీన్గాడి మొకం వొందకేండీలు బల్బెలిగినట్టు ఎలిగింది.

"సార్! నాపేరు మతీన్సార్! మా ఇల్లు గంజిపాలెంలోనే సార్" అన్నాడు మతీన్గాడు కడుపాత్రం పట్టలేక గబగబా. (ఆడి మాటలకర్థం మనం మనం సాయిబ్బులమే అని)

ఆయన ఆడి బాదని గమనించి ఆప్యాయతగా చిర్నవ్వు నవ్వేడు.

"సార్... సార్ మీరు మాకు పల్టీలు నేర్పుతారా సార్" అని సాయిబ్బుల బాసలో ఆశగా అడిగేడు మతీన్గాడు.

సంపంగిగాడూ, నేనూ మతీన్గాడు ఉర్దూలో అడిగినందుకయినా కరీముల్లా సార్ ఎప్పుకోకూడదా అని ఎదురుచూత్తా వున్నాం. 'సరే'నని ఆయనకట్టా అన్నాడోలేదో ఇసుకదిబ్బలంతా అద్దిరిపోయేటట్టు 'హేయ్' అని గావుకేకలేస్తా ఎగిరాం ముగ్గురం.

ఆరోజునుంచి మా పల్టీల కత మారిపొయ్యింది. ఎదో గాలికి, దూలికి నేర్చుకుందావనుకున్న పల్టీలు కరీముల్లా సార్ చలవ వొల్ల ఒక తీరీగా నేర్చుకోవడం మొదలుపెట్టేం. కరీముల్లాసార్ మంచినీళ్ల దొరువు ముందు మమ్మల్ని కూచోబెట్టి ఆయన పల్టీలు నేర్చుకునేటప్పటి జరిగిన సంగతుల్ని కతలు కతలుగా బలేగ విడమర్చి చెప్పేవోడు.

ఒకసారి ఆయన రాష్ట్రస్థాయిలో పల్టీల పోటీ (జిమ్నాస్టిక్స్ అంటా ఇంగిలీషులో, సార్ చెప్పేరు)కి ఎళ్తే, ఆడ సారెంత బాగా జేసినా కూడా ఫ్రెయిజు ఇయ్యలేదంట. ఎవరో ఓ మాదిరిగా చేసిన ఒకతనికి ఇచ్చారంట ఫ్రెయిజు. అట్టా రెండుమూడుసార్లు అయితే సార్కి కోపం వచ్చి, జడ్జీల కాడకి పొయ్ 'ఏందీ అన్నేయం' అనడగితే మొకం చిట్లించుకున్నారంట గానీ, సమాదానం చెప్పలేదంట. ఆ తర్వాత తేలిందేమంటే సారు సాయిబ్బని చెప్పి ఫ్రెయిజు ఇవ్వకుండా ఎగ్గొట్టేరంట. సాయిబ్బని ఫ్రెయిజివ్వకపోవడమేంటో ఎంతాలోచిచ్చినా నాకర్థం కాలా. ఆ మాటే అడిగితే దిగులుగా మబ్బులు కమ్మిన మొకంతో జీవంలేని నవ్వు నవ్వుతా 'అది మీకర్దం కాదులేరా ఈ వొయస్సులో' అనేవాడు బారంగా ముక్కుల్నించి గట్టిగా గాలొదులుతా.

రోజూ మేం ఆడ పల్టీలేత్తావుంటే ఆ ఇసుకదిబ్బలదారెమ్మట పొయ్యేవోళ్లు, వచ్చేవోళ్లు మమ్మల్ని మా పల్టీల్ని జెమినీ సర్కసు చూసినంత దీచ్చగా, ఇచిత్రంగా చూస్తా తలాడిచ్చుకుంటా పోతావుండేవోళ్లు

ఇట్టా రోజులు సిన్మారీల్లులాగ తిరిగిపోతా వుండయ్యి. ఇప్పుడు మేం ఇసకదిబ్బల మీద కాకుండా నేరుగా నేలమీదే చక్కంగా పల్టీవేస్తన్నాం. చేతులు కిందానకుండా గాల్లో పల్టీలు కూడా మంచినీళ్లు తాగినంత మామూలుగా ఏసేత్తన్నాం.

ఇట్టా రోజులు సిన్మారీల్లులాగ తిరిగిపోతా వుండయ్యి. ఇప్పుడు మేం ఇసకదిబ్బల మీద కాకుండా నేరుగా నేలమీదే చక్కంగా పల్టీవేస్తన్నాం. చేతులు కిందానకుండా గాల్లో పల్టీలు కూడా మంచినీళ్లు తాగినంత మామూలుగా ఏసేత్తన్నాం.

ఇట్టా రోజులు మూడు పిల్లిమొగలు ఆరు పల్టీలుగా ఎలుగుతున్నటయింలో ఒకరోజు మా క్లాసులోకి ఒక నోటీసొచ్చింది. 'హైస్కూలు గేమ్సు వచ్చేనెల్లో జరుగుతాయని, ఆటలాడే ఇంటరెస్టున్నోళ్లు ఆళ్ల ఆళ్ల పేర్లని డ్రిల్లుమాష్టరికి ఇవ్వాల'ని నోటీసు చదివి చెప్పాడు మా హిందీ మాష్టరు ఆచారి పంతులు.

ఆడొకడు ఆడొకడుండే మా హైస్కూలు గ్రవుండు ఆరోజు నుంచి పిలకాయల కోలాహలంతో నిండిపోయింది. ఆడపిల్లల రింగాట, ఖోఖో ఆటలు ఎక్కువయ్యాయి. డ్రిల్లు మాష్టర్లు ఆటలాడేవోళ్ల పేర్లు మా కళ్లముందే కాగితం మీద ఎక్కించుకుంటా వుంటే మా కీడ పేణాలు పీకుతా వుండాయి. కనీసం ఒక డ్రిల్లు మాష్టరు కూడా 'జిమ్నాస్టిక్కు చేసేవోళ్లున్నారా'అనిఅడగడంలా.

మర్నాడీ సంగతి సరికతోపులకాడ కరీముల్లా సార్కి చెప్తే ఆయన కనుబొమలు రెండు దగ్గరికంటా ముడేసి 'జిమ్నాస్టిక్కు ఎందుకుండవూ..? వుంటయ్. పొయ్యి మీ డ్రిల్సు మాష్టర్నేగట్టిగా అడగండి' అన్నారు.

ఆ సాయంకాలం మూడో పిరీదు తర్వాత మేం ముగ్గురం కల్సి ఎట్టాగో ధైర్నం జేసి డ్రిల్లు మాష్టర్ని అడిగేసాం.

ఆయన మమ్మల్ని పురుగుని ఇదిలించినట్టు ఇదిలించేసాడు.

"మూడేళ్లమించి మన స్కూల్లో ఎవురూ జిమ్నాస్టిక్సుకి పేర్లు ఇయ్యడంలా. అందుకే ఈ యేడు అది రాయలా. ఏందీ...? మీ పేర్లిస్తారా యేందీ...?" అన్నాడాయన చిట్టచివరికి మేం పట్టొదలకుండా ఆయన ఎనకీడతా గేమ్సు రూముదాకా పోతే.

'హమ్మయ్యా' అని అప్పటిదాకా ఉగ్గబట్టిన ఊపిరొదిలి, ఆలస్యం అయితే యాడ మనస్సు మార్చుకుంటాడోనని గబగబా కాగితాలమీద వివరాలన్నీ రాసిచ్చాం.

అప్పట్నుంచి పొద్దుల్నేదు సాయంత్రం లేదు. ఇసకదిబ్బల మీదే కాపరం పెట్టేం. దుమ్ముదుమ్ముగా పల్టీలు ప్రాక్టీసు చేసాం.

తీరా పోటీలు రేపనంగా మతీన్గాడి నానకి యాక్సిడెంటయ్యి ఆడు ఆస్పత్రిలో ఉండి పోవల్సొచ్చింది. మతీన్గాడు లేక పేణం కాస్త ఉసూరుమనినా నేనూ, సం పంగిగాడూ పట్టుదొలగానే రెడీ అయ్యాం.

పోటీలు మా హైస్కూల్లోనే.

వోపక్క బాటిమింటూ, మరోపక్క కబాడీ, ఇంకోపక్క రన్నింగు... గ్రవుండంతా దసరా తిరనాలలాగుంది.

గ్రవుండులో ఓ మూల మా జిమ్నాస్టిక్సు పోటీలు మొదలయ్యాయి. జాండ్రపేట, ఈపురుపాలెం, పేరాలలాంటి స్కూల్లు చాలా వున్నయ్యి. ఒక్కొక్క స్కూలోళ్ల పేర్లు చదవంగానే ఆ స్కూలోళ్లు ఎళ్లి వరుసగా పల్టీలు ఏత్తన్నారు. పోతన్నారు, ఏత్తన్నారు. పోతన్నారు.

'అస్సలికి వాళ్లేసేవి పల్టీలా...? ఛూ... నీయమ్మ... ఆళ్లకి పక్క పల్టీయే సరీగొచ్చి చావడంలేదు... ఇంక ఎనక్కి పల్టీలు... గాల్లో పల్టీలు ఏం ఏత్తారు. ముండనాయాళ్లు... ముండనాయాళ్లని...'

నాకు నమ్మకం వొచ్చేసింది... మేమే గెలుత్తామని...!

మునేళ్లమీద నుంచొని ఎప్పుడెప్పుడా అని ఎదురుచూత్తన్న మా వొంతొచ్చింది.

ముందు సంపంగిగాడు- తూనీగలాగా రయ్యిన లగెత్తుకెళ్లి మెరుపల్లే గాల్లోకెగిరి- మెరికలాగ పల్టీకొట్టేసరికి పిల్లలతో కూడా డ్రిల్లు మాష్టర్లిద్దరూ 'ఆ... నెస్టు, నెస్టు' అని అంటం కూడా మర్చిపొయ్యి ఆట్నే నోళ్లు తెరిచి నిలబడ్డారు.

గూమిగూడిన స్కూలు పిలకాయలంతా హుషారుషరుగా కేకలేసి చేతులు పగిలేలా చప్పట్లు కొట్టేరు.

ఇక నా వొంతు...!

పల్లు బిగబట్టి- లగోదీసి- వరుసగా నాలుగు ఎనక పల్టీలేసి పడేసా... ఆక్కుండా!

మళ్లా చప్పట్లు- ఈలలు... కేకలు...!

'ఆహా... అబ్బా... భలే ఏసారన్నా' అని మా చుట్టూ మూగుతావున్న పిలకాయల్ని కూడా పట్టించుకోకుండా నేను డ్రిల్లు మాష్టార్లొంక చూత్తా నిలబడ్డా.

డ్రిల్లు మాష్టర్లు ఏ పేర్లు చదివితే ఆళ్లు గెలిచినట్లు.

గుండెలు బిగబట్టుకొని చూత్తావున్నాం సంపంగిగాడూ, నేనూ.

నుదురు మీద మూడు నిలువుబొట్లు పెట్టుకున్న డ్రిల్లుమాష్టరు. మా డ్రిల్లు మాష్టరు రెక్క పట్టుకొని పక్కగా తీస్కెళ్లాడు.

ఏం జరుగుతుందోనని తుత్తరుండబట్టలేక నేనుగూడా ఎళ్లి వాళ్లెనమాలగా నిలుచున్నా. ఆళ్ల మాటలు చక్కంగా వొచ్చి నా చెవుల్లో పడతన్నయ్యి.

"ఏందిసార్... కబాడీ కూడా మీరే గెలిచారు. కనీసం ఇదన్నా మాకివ్వండి సార్" అంటున్నాడు నిలువుబొట్ల మాష్టరు.

"ఎట్టాసార్? మా పిలకాయలు బాగా చేసారు కద్సార్..." మా డ్రిల్లు మాష్టరు చేతులు పిసుక్కుంటూ నసుగుతున్నాడు.

"సార్! నేను ఎందుకడుగుతున్నానో అర్థం చేసుకోండి. ఇందులో మా బంధువులబ్బాయి వున్నాడండీ. అందుక్కదూ మిమ్మల్ని బతిమిలాడుకుంటా నేను హి... హి...హి.." అంటున్నాడు నిలువుబొట్టు.

"అదా సంగతి మరిచెప్పరే..." అని విషయమంతా అర్థమైనట్టు కడుపు కదిలేలా నవ్వేడు మా డ్రిల్లు మాష్టరు. నవ్వుకుంటానే వొచ్చి ఏ హైస్కూలు గెలిచిందో చదివేడు.

మాది తాడు ఫ్రెయిజు.

సంపంగిగాడూ నేనూ ముకముకాలు చూసుకున్నాం. నెయ్యికింద గోదారిలాగ మా ఇద్దరి మొకాలు నల్లంగా మాడిపొయ్యి వున్నయ్యి.

ఎప్పుడొచ్చాడో ఏమో కరీముల్లా సార్ అశోక చెట్టుకింద నిలబడి చెయ్యెత్తి పిలుత్తా వున్నాడు.

ఆయన్ని చూసేసరికి నాకు బలే దుఖ్ఖమొచ్చింది.

'కనీసం సార్ని రాష్ట్రస్థాయికయినా పోనిచ్చారు. మమ్మల్ని హైస్కూలు స్థాయికే హతం చేసారే...' అని అనుకుంటా కరీముల్లా సార్ కడకిపోయా.

ఆయన మా మూడు చెక్కమొకాలు చూసి జరిగింది అర్థం చేసుకున్నాడు. నా భుజం మీద చెయ్యేసి "నేచెప్తున్నాగారా... మీదే ఫస్టు ఫ్రెయిజు. ఇదే నేనిచ్చే ఫ్రెయిజు. మేట్నీకి కరాటే సిన్మా టిక్కెట్లు. పొండి.. పొండి..మళ్లా టయిమయిపోతంది..." అంటా కరీముల్లా సార్ హడావుడి చేసి మాడిపోయిన మా మొకాల మీద మళ్లీ నవ్వుల్ని మొలిపిచ్చాడు. ●